ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 24.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5



నారాయణపేట
జిల్లా వార్తలు
మంగళవారం 19 ఆగస్టు 2025

## ఆర్టీసీ బస్సు కిందపడి మహిళ మృతి

- దిగే క్రమంలో కిందపడిన లక్ష్మి
- బస్సు ముందుకు కదలడంతో కాళ్లపై నుంచి వెళ్లిన వెనుక టైర్లు
- ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు చెప్పిన వైద్యుడు
- నారాయణపేట జిల్లా గుండుమాల్‌లో ఘటన

7



మాగనూరు మండలం అడవిసత్యారం బ్రిడ్జిపై ఉధృతంగా పారుతున్న నీరు



బాలానగర్ మండలంలో వర్షాలకు ఎరుపెక్కుతున్న పత్తి పంట



నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్లలో కూలిన ఇల్లు



'పేట' మండలంలో అలుగు పారుతున్న అప్పిరెడ్డిపల్లి చెరువు

# కుండపోత

## మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో భారీ వానలు

- నిండిన కుంటలు, చెరువులు
- ఎరుపెక్కుతున్న పత్తి పంట.. దెబ్బతింటున్న కంది
- పాత ఇళ్లకు పొంచి ఉన్న ప్రమాదం
- మరో మూడు రోజుల పాటు వర్షాలు ఉండటంతో ఆందోళన

మహబూబ్‌నగర్/నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వానలు వదలడం లేదు. పది రోజులుగా కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రోజంతా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. కొద్ది రోజులకు ముందు వర్షం కోసం ఎదురు చూసిన రైతులు.. ఇప్పుడు రోజూ భారీ వర్షాలు కురుస్తుండటంతో వర్షాలు బంద్ కావాలని కోరుకుంటున్నారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో అదే జరిగితే అతివృష్టికి దారితీసే అవకాశం లేకపోలేదు. రెండు జిల్లాల్లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 మండలాల్లో సాధారణం కన్నా 82.7 శాతం అధిక వర్షం కురిసింది. ఈ నెల 18 నాటికి సగటున 322.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 589. 3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జడ్చర్ల, బాలానగర్, భూత్పూర్ మండలాల్లో ఈఏడాది కురవాల్సిన సాధారణ వర్షపాతం కన్నా ఆగస్టు నాటికే అధిక వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు అలుగులు పారుతుండగా, వాగులు పొంగుతున్నాయి. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల పరిస్థితి ఏంటని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**పాలమూరు జిల్లాలో పంటల సాగు లక్ష్యం, సాగైన వివరాలు**

| పంట | లక్ష్యం | సాగు |
|---|---|---|
| వరి | 2,00,000 | 1,20,806 |
| మొక్కజొన్న | 38,325 | 35,894 |
| జొన్న | 16,600 | 10,154 |
| కందులు | 10,925 | 9,611 |
| పత్తి | 87,863 | 78,107 |
| ఇతర | 15,863 | - |

### వరికి ఓకే.. పత్తికి నష్టం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరిసాగు జోరందుకుంది. బోర్లు రీచార్జి కావడంతోపాటు చెరువులు నిండటంతో ప్రస్తుత వానాకాలం పంటతోపాటు యాసంగికి కూడా ఢోకా ఉండదు. అయితే పత్తి పంటను మాత్రం వర్షాలు దెబ్బతీస్తున్నాయి. చెల్క పొలాల్లో వేసిన పంటకు అంతగా ఇబ్బంది లేకపోయినా, రేగడి, సౌడు భూముల్లో వేసిన పంట దెబ్బతింటోంది. ఎర్రగా మారుతోంది. కలుపుతీసే పరిస్థితి లేకపోవడంతో చేను కన్నా కలుపు ఎక్కువగా పెరిగింది. పంట గిడసబారిపోతోంది. మరో నాలుగైదు రోజులు ఇలానే వర్షాలు పడితే నల్లరేగడి, సౌడునేలల్లో వేసిన పత్తి పంటలపై రైతులు ఆశలు వదులుకోవాల్సిందే. మొక్కజొన్నకు పెద్దగా నష్టం లేకపోయినా కంది పంట దెబ్బతినే ప్రమాదముంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి పంటకు నష్టం వాటిల్లుతున్నందున ముున్ముందు వరి సాగు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 3.64 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా ఇప్పటివరకు 2.63 లక్షల ఎకరాలు సాగైంది.



మక్తల్ మండలం కర్ని గ్రామం వద్ద అలుగు దాటుతూ విధులకు వెళ్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

### ముసురు వర్షాలకు కూలుతున్న ఇళ్లు

వరుసగా కురుస్తున్న వర్షాలు, ముసురుకు పాత మట్టి మిద్దెలు ఇండ్లు నాని, అక్కడక్కడా కూలుతున్నాయి. అధికారులు కూలే ఇండ్లపై కాకి లెక్కలు తీస్తున్నారు. ఇప్పటికే ప్రతీ మండలంలో పదుల సంఖ్యలో పాత ఇండ్లు కూలుతున్నాయి. నవాబ్‌పేట మండలంలో ఇప్పటికే 8-10 ఇండ్లు కూలిపోగా, అధికారులు మాత్రం మూడు ఇళ్లు మాత్రమే కూలాయని చెబుతున్నారు. మరికొన్ని రోజులు వానలు కురిస్తే పాత ఇండ్ల పరిస్థితి ఆందోళనకరంగా ఉండనుంది. అలాంటి వాటిని అధికార యంత్రాంగం ముందుగానే గుర్తించి, అందులో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. కూలి ఇళ్లకు ఎలాంటి పరిహారం అందలేదు. మండల అధికారులు కలెక్టర్‌కు నివేదికలు ఇస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఐదు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

### నారాయణపేట జిల్లాలో 77 శాతం అధిక వర్షం

- నిండిన 295 చెరువులు

నారాయణపేట జిల్లాలో ఈ వానాకాలంలో ఇప్పటి వరకు 300.4 మిల్లీ మీటర్ల వర్షం కురియాల్సి ఉండగా 531.4 మిల్లీ మీటర్లు కురిసింది. 77 శాతం అధిక వర్షపాతం నమోదైంది. 4.24 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేయగా, 3,53,604 ఎకరాల్లో సాగు చేశారు. అధికంగా పత్తి, ఆ తర్వాత వరి సాగు చేశారు. వరి 1,75,698 ఎకరాలకుగాను 1,16,748 ఎకరాల్లో నాటారు. పత్తి 1,57,184 ఎకరాల్లో, కందులు 66,584, జొన్న 5,949, పెసర 5,904 ఎకారాల్లో సాగు చేశారు. నల్ల కందులు 214 ఎకరాల్లో, మొక్కజోన్న 30, రాగులు 73, చెరుకు 500 ఎకరాల్లో వేశారు. ప్రస్తుతం పెసర పంట ఏరుతున్నారు. భూమి సారవంతం కోసం జీలుగ, జనపనార 7,735 ఎకరాల్లో సాగు చేసిన రైతులు వరి నాటేందుకు కలియదున్నుతున్నారు.


**నిండిన చెరువులు**

జిల్లాలో 769 చెరువులు ఉండగా, 295 చెరువులు పూర్తిగా నిండాయి. 207 చెరువులు 75 శాతానికిపైగా, 185 చెరువులు 55 శాతానికిపైగా, 51 చెరువులు 25 శాతానికి పైగా, 31 చెరువులు 25 శాతం వరకు నిండాయి.

## మదిని దోచే.. దృశ్య రూపం

- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

6



'పేట' కొండారెడ్డిపల్లి చెరువు వద్ద సాయం సంధ్యవేళ సుందర దృశ్యం








### పాఠశాలలో పశువులను ఉంచడంపై
# నివేదిక ఇవ్వండి

- ఎంఈవోను ఆదేశించిన డీఈవో ప్రవీణ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాబాద్ మండలం బోరింగ్ తండా పాఠశాల భవనాల్లో పశువులను, మేకలను ఉంచడంపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'పశువుల శాల' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న డీఈవో ప్రవీణ్‌కుమార్ అక్కడ రెండు పాఠశాల భవనాలు ఎందుకు వృథాగా ఉంచారని? ఎంఈవో రాజునాయక్‌ను ఆరా తీశారని తెలిసింది. పాఠశాల భవనాల్లో తండావాసులు పశువులను, మేకలను కట్టేయడంపై ప్రశ్నించినట్లు సమాచారం. పాఠశాల ఎందుకు మూతపడింది?, తండాలోని పిల్లలు పాఠశాలల్లో చేరకుండా ప్రైవేట్ పాఠశాలలకు ఎందుకు వెళ్తున్నారని, భవనాలను అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల కొనసాగించేందుకు అనుమతి ఇచ్చే విషయమై అడిగారని తెలిసింది. వారంలో పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు ఎంఈవో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తండావాసులతో మాట్లాడి విద్యార్థులను పంపిస్తే పాఠశాలను కొనసాగిస్తామని అన్నారు. డీఈవో, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడి ఓ భవనాన్ని అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల నిర్వహణ కోసం కేటాయిస్తామన్నారు. పాఠశాల ఆవరణలో పశువులను కట్టేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### పాలమూరుకు
# రెండు ఏటీసీలు

- జడ్చర్ల, సీసీకుంట నియోజకవర్గాలకు మంజూరు
- ఒక్కోటి రూ.45 కోట్లతో ఏర్పాటు
- వెల్లడించిన ఎమ్మెల్యేలు జీఎంఆర్, అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/సీసీకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు ఐటీఐ(ఏటీసీ-అడాన్స్‌డ్ టెక్నాలజీ కాలేజ్)లు మంజూరయ్యాయి. దేవరకద్ర నియోకవర్గానికి సంబంధించి చిన్నచింతకుంట మండలం పల్లమర్రి గ్రామంలో, జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి రాజాపూర్ మండలం ఈద్గానిపల్లిలో కళాశాలలను నిర్మించనున్నారు. ఒక్కోటి రూ.45 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాలను ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి సోమవారం తెలిపారు. దేవరకద్రలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీకి అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఐటీఐలకు ఏఐ టెక్నాలజీని జోడించిందని తెలిపారు. ఇవి రాష్ట్ర అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తేనున్నాయని అన్నారు. మండల ప్రజలు, విద్యార్థులు, యువతకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జడ్చర్లలో అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే జడ్చర్ల నియోజకవర్గానికి ఐఐఐటీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయంలు మంజూరు అయ్యాయని, తాజాగా అధునాతన సాంకేతిక శిక్షణ కళాశాల మంజూరు అయ్యిందని తెలిపారు.

### ట్రిపుల్ ఐటీ పాలమూరుకు తలమానికం

- తాత్కాలిక భవనంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

6



సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేందిర బోయి


### బహుజనుల ధీరుడు
# సర్వాయిపాపన్న గౌడ్

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

పాలమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు.. ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ విజయేందిర బోయి, గౌడ సంఘం ప్రతినిధులతో కలిసి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, జాతి, వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏళ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో శంకుస్థాపన చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, బెక్కరి అనిత పాల్గొన్నారు.



అందం చూడవయా.. మహబూబ్‌నగర్ మయూరీ నర్సరీలో పెద్దసీమ కోళ్లు



వనపర్తి జిల్లా ఘణపురం మండలం షాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఉన్న కొట్టేసిన చెట్టుపై చిగురిస్తున్న ఆకులు



వనపర్తిలో 79వ స్వాతంత్ర్య వేడుకలలో జాతీయ జెండాలతో విద్యార్థులు



మదనాపురం మండలం పరిధిలోఉన్న సరళాసాగర్ ప్రాజెక్టు వద్ద ఆకాశంలో వరుస క్రమంలో పక్షులు

# మదిని దోచే.. దృశ్య రూపం

## నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా..




వనపర్తి జిల్లా కేంద్రంలో ఆకట్టుకుంటున్న పువ్వులు



వనపర్తిలో చెట్టు కొమ్మ ఆకారంలో పురుగు

నీలాకాశంలో పాలమూరు అందమెులికె..





మహబూబ్‌నగర్ బైపాస్‌లో పాలకొండ చెరువు చుట్టూ ఎర్రని ఆకాశం



వేలిపై సూర్యుడి ప్రతిబింబం కిస్పించేలా...



వనపర్తిలోని ఓ ఇంటిలో సాలీడ్ గూడు



పామాపురంలో ఉన్న ఊకచెట్టి చెక్‌డ్యాంలో శివుడి విగ్రహం వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



ఫొటో అంటే మాటలకు అందని ఎన్నో భావాలకు దృశ్యరూపం.. క్షణ కాలపు దృశ్యాన్ని శాశ్వతంగా మార్చే ఇంద్రజాలం. గత జ్ఞాపకాలను, వర్తమాన విన్యాసాలను భవిష్యత్తు తరాలకు అందించే బహుమానం.. భారత స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించిన మహానుభావులు, యోధుల చిత్రాలను, వారి ఉద్యమ రూపాలను నేటి తరానికి అందించినది ఈ ఫొటోలే.. ఫొటోగ్రఫీ సృజనాత్మకతకు అద్దం పట్టే అందమైన ప్రపంచం. ఎవరి ఇంట్లో చిన్న శుభకార్యం జరిగినా కెమెరాలలో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించుకొని పదిల పరుచుకుంటారు. మరికొందరు ప్రకృతి సోయగాలను, అందమైన దృశ్యాలను తమ కెమెరాలలో బంధించి భద్రపరచుకుంటారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా.. 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్లు, విలేకరులు తీసిన అందమైన చిత్రాల సమాహారం...

- నారాయణపేట/ధరూర్/ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, వనపర్తి, మహబూబ్‌నగర్ )



వనపర్తిలో రాత్రి వేళలో పున్నమి చందమామ



నారాయణపేట జిల్లా సరిహద్దులో మర్రిచెట్టుపై తాటి చెట్టు ఇలా...



వనపర్తి మండలం అచ్యుతాపురం శివారు ప్రాంతంలో నెమలి



హన్వాడ సమీపంలో చెట్టుపై కొంగల సమూహం



హన్వాడ మండలం టంకర పెద్ద చెరువులో తెల్లకొంగల విహారం



గద్వాలలో జూరాల డ్యాం వద్ద కనువిందు చేస్తున్న పుష్పం



వనపర్తి జిల్లాలో బుద్ధారం గండి వద్ద చెక్ డ్యాం జలపాతం దృశ్యం

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కోస్గి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించిన వా లీబాల్ పోటీలలో గుండుమాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నీలిమ వర్ధిని తెలిపారు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 15 వాలీబాల్ పోటీలకు ఎంపికైన పల్లవి, మౌనిక, జగదీష్ విద్యార్థులను సోమవారం ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి రాణించాల ని విద్యార్థులను ప్రోత్సహించారు. వైస్ ప్రిన్సిపాల్ రహీమ్, పీడీ సాధిక్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రిషి విద్యార్థి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 18,19వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాల విద్యార్థి గౌతమ్ ఎంపికయ్యాడు. ఈ నెల 16న జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావటం పట్ల న్యూరిషి సంస్థల చైర్మన్ చంద్రకళ, డైరెక్టర్లు పూజిత, శిరిష, ప్రవీణ్‌కుమార్, సాయిసుశాంత్, కృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రారంభమైన పీజీ, బీ ఫార్మసీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూని వర్సిటీలో పీజీ నాల్గవ సెమిస్టర్, బీ ఫార్మసీ ఆరవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పరిశీలకులు డాక్టర్ నూర్జహన్‌తో కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత ఆబ్సెంటీస్, ప్రజెంటీస్‌ను ఆ న్‌లైన్‌లో పొందుపరచాలని, క్వశ్చన్ పేపర్‌లో సిలబస్ ప్రకారంగా క్వశ్చన్స్ వచ్చాయో లేదో సరిచూసుకోవాలని అన్నారు. పీజి నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 767 మంది విద్యార్థులకు గాను 749 మంది హాజరయ్యారని, బీ ఫార్మసీ ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 193 మంది విద్యార్థులకు గాను 188 మంది హాజరయ్యారని తెలిపారు.

## వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

- వందలాదిగా తరలివచ్చిన భక్తులు
- గుట్టపై మారుమోగిన శివనామం
- వర్షాన్నిసైతం లెక్కచేయక స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

ఊట్కూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పులిమామిడి గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీరామ లింగేశ్వర స్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం వందలాది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. శివనామాన్ని జపిస్తూ భక్తులు స్వామి వారి రథాన్ని ముందుకు లాగారు. స్వామి రథోత్సవాన్ని చూడటానికి వందలాదిగా భక్తులు తరలిరావడంతో రామలింగేశ్వరుడి గుట్ట భక్తులతో కిటకిటలాడింది. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద అగ్ని గుండం కార్యక్రమం నిర్వహించారు. ఈ అగ్నిగుండం సందర్భంగా శివ నామస్మరణంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తున్నా అవేవి పట్టించుకోకుండా భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా బంధువుల రాకతో గ్రామం అంతా సందడిగా మారింది. ఈ రథోత్సవంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎల్లాగౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ సూరయ్యగౌడ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్ర ముఖులు, పులిమామిడి, ఊట్కూర్, ఎడవెల్లి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, బిజ్వార్, జక్లేర్, మగ్దుం పూర్, కొత్తపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



గుట్టపై స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

## ట్రిపుల్ ఐటీ పాలమూరుకు తలమానికం

- మహబూబ్‌నగర్ విద్యార్థుల చిరకాల స్వప్నం సహకారం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- తాత్కాలిక భవనంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానసపుత్రిక ఐఐఐటీ కళాశాల అని ట్రిపుల్ ఐటీ పాలమూరుకు తలమానికం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బండమీదపల్లిలో గల రెడ్డి హాస్టల్‌లో తాత్కాలింగా ఏర్పాటు చేసిన ఐఐఐటీ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పదవ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా 210 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఐఐఐటీ కళాశాల తరగతులు ఈ నెల 22న ఓరియంటేషన్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఇందుకుగాను యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, టీచింగ్ సిబ్బంది నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం రెగ్యులర్ తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఇక్కడ ఇది తాత్కాలిక భవనమే అయినప్పటికీ విద్యార్థులకు హాస్టల్ యాజమాన్యం అన్ని వసుతులు ఉంటాయని తెలిపారు. పక్క భవనాల కోసం దివిటిపల్లిలో 42 ఎకరాలలో నిర్మించను న్న అధునాతన భవనానికి ముఖ్యమంత్రి త్వరలోనే శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ పనులు రెండు, మూడు ఏళ్లలో పనులు పూర్తిచేసి అధునాతన భవనాలను అందుబాటలోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన హాస్టల్, డైనింగ్‌హాల్, తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, రెడ్డి సేవా సంఘం సభ్యులు సురేందర్‌రెడ్డి మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్‌కమార్‌రెడ్డి, నాయకులు అచ్యుగట్ల అంజయ్య, గంగిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదులను, కళాశాల ఆవరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## ఇండో-నేపాల్ కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇండో-నేపాల్ కరాటే చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు డ్రాగాన్‌షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్.కే. మోసీన్ తెలిపారు. టోర్నీలో 10 బంగారు, 5 వెండి, 2 బ్రౌన్, 1 కతాలో పతకం, మొత్తం 18 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలంబిన్ ఉమర్ అభినందించారు.



ఇండో-నేపాల్ కరాటే టోర్నీలో పతకాలు సాధించిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థులు

## పశువులతో పంట చేను ధ్వంసం

- అడిగినందుకు దాడి

నవాబ్‌పేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పంటచేను పశువులతో మేపి ధ్వంసం చేసిన వ్యక్తిని పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడదామని పిలిచినందుకు ఆయన కుమారుడు మమల్ని పంచాయితీకి పిలుస్తావా అంటూ దాడి చేసిన సంఘటన నవాబ్‌పేట మండలంలోని కాకర్లపాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వార్ల మారుతికి చెందిన మొక్కజొన్న పంటను అదే గ్రామానికి చెందిన కావటి కృష్ణయ్య తాగిన మైకంలో తన గేదెలతో ఈనెల 17న మేపి ధ్వంసం చేశాడు.

ఈ విషయంపై మారుతి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని పిలచేందుకు యత్నించగా ఆయన కుమారుడు నాగరాజు అకారణంగా భూతు మాటలు తిడుతూ రాయితో ముఖంపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చేరాడు. గాయ పర్చిన వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలో గంగాపురం వెళ్లే దారిలో హరినివాస్ సమీపంలోని వెంకటేశ్వరకాలనీలో సోమవారం మధ్యాహ్నం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. జడ్చర్ల ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు... కాలనీలో నివాసం ఉంటున్న మాదరి ఆంజనేయులు ఇంట్లో చోరీ జరిగిందని తెలిపారు. ఉదయం 11.30గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బ్రహ్మంగారి గుడి సమీపంలోని తమ దుకాణానికి వెళ్లి, మధ్యాహ్నం 1.30నిమిషాలకు ఇంటికి వచ్చారని తెలిపారు. ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగిందని గుర్తించి, సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు.

ఇంట్లో బీరు వాలో దాచిన 8తులాల బంగారు వస్తువులు, 8తులాల వెండి వస్తువులతో పాటు రూ.30వేల నగదు చోరీ అయ్యాయని బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

## వివాహిత అదృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యం అయిన సంఘటన ఆత్మకూరు పట్టణకేంద్రంలో చోటు చేసుకుంది. వడ్డె అంజమ్మ భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణ కేంద్రానికి చెందిన వరికుప్పల తిరుపతి, రాములమ్మ దంపతు లు కాగా రాములమ్మ చెల్లెలు వడ్డె అంజమ్మకు అనారోగ్య సమస్యలు ఉన్నందున బావ వరికుప్పల తిరుపతికి ఇచ్చి గత 15 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. గత నెల క్రితం 2వ భార్య అయిన అంజమ్మ బంగారు చెవి కమ్మలు కుదువ పెట్టినారని, నా చెవి కమ్మలు నాకు విడిపించాలని ఈనెల 15వ తేదీన ఉదయం 9:30 గంటల సమయంలో భర్త తిరుపతయ్య మొదటి భార్య రాములమ్మతో గొడవ పడింది. ప్రస్తుతం డబ్బులు లేవు. డబ్బులు జమ కాగానే విడిపించి ఇస్తామని రాములమ్మ తెలిపింది. అదే రోజు మూడు గంటల సమయంలో భర్త తిరుపతయ్య దగ్గరకు వెళ్లి ఆసుపత్రికి వెళ్లి వస్తాను డబ్బులు ఇవ్వాలని అడిగింది. భర్త వెయ్యి రూపాయలు ఇచ్చాడు.

ఆసుపత్రికని తిరిగి వెళ్లిన అంజమ్మ రాత్రి వరకు ఇంటికి రానందున భర్త తిరుపతయ్య మొదటి భార్య రాములమ్మలు చుట్టు పక్కల గ్రామాల బంధువుల ఇళ్లలో వెతకగా సమాచారం లభించలేదు. సోమవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చారని తెలిపారు.

## కస్తూర్బా విద్యార్థిని..

దేవరకద్ర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అదృశ్యమైన్న సంఘటన చోటు చేసుక్నుట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని డోకూర్ సమీపం దగ్గర ఉన్న కస్తూర్బాలో అక్షిత అనే విద్యార్థి ఇంటర్ సెకండియర్ చదువుతుంది. ఆదివారం ఉదయం పాఠశాల నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఇంటికి కూడా పోలేదని తల్లితండ్రులు చెప్పడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

## గొంతులో గుడ్డు ఇరుక్కుని వ్యక్తి మృతి



ఈశ్వరయ్య (ఫైల్)

కల్వకుర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గొంతులో గుడ్డు ఇరుక్కుని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ముకురాలలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని ముకురాల గ్రామానికి చెందిన ఇంజమూరి ఈశ్వరయ్య(56) ఆదివారం రాత్రి భోజనం చేయడానికి అన్నంతో పాటు గుడ్డును పెట్టుకున్నారు. భోజనం తినే క్రమంలో గుడ్డు గొంతులో ఇరుక్కుంది. దీంతో ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు గొంతులో నుంచి గుడ్డు తీసేందుకు ప్రయత్నించారు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన కల్వకుర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఈశ్వరయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు కిందపడి మహిళ..

కోస్గి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల కేంద్రంలో చోటు చేసుకొంది. కోస్గి ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం... గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన బోడ లక్ష్మి(45) సొంత పనుల నిమిత్తం కోస్గి వెళ్లి, గుండుమాల్‌కు ఆర్టీసీ బస్సులో తిరుగుప్రయాణం అయ్యింది, గుండుమాల్ అంబేడ్కర్ చౌరస్తా దగ్గర ఆమె బస్సు దిగే క్రమంలో కిందపడి పోగా గమనించని డ్రైవర్ బస్సును ముందుకు కదలించడంతో బస్సు వెనక చక్రాలు ఆమెపై నుంచి పోవడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. 108లో కోస్గి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త బోడ చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌పేటకు చెందిన వర్కూర్ శ్రీనివాసులు(48) నారాయణపేట పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం కాలినడకన వెళ్తుండగా, కాళమ్మరోడ్ క్రాసింగ్ దగ్గర ఓ బైక్ వేగంగా వచ్చి శ్రీనివాసులును ఢీకొనింది. దీంతో గాయాలైన అతడ్ని చికిత్సకోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా జడ్చర్ల సమీపంలో అంబులెన్స్‌లో మృతి చెందాడు. కొడుకు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

## హోంమంత్రి అమిత్‌షాను కలిసిన ఎంపీ డీకే అరుణ



కేంద్ర హోం మంత్రిని అమిత్‌షాతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సోమవారం పార్లమెంట్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు.

పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటూనే కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయాలు తదితర అంశాలపై చర్చించినట్లు ఆమె స్థానిక విలేకరులతో ఫోన్‌లో వెల్లడించారు.



ఊట్కూర్ మండలం పగిడిమర్రి వాగు ప్రవాహంతో నిలిచిన రాకపోకలు



మూసి వేసిన అల్వాల-పెద్దమందడి రహదారి



ఇటిక్యాల రైల్వే వంతెన దగ్గర నిలిచిన వర్షపు నీరు

# జడివాన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. బ్రిడ్జిలపై నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో పలు గ్రామాల రహదారులు మూసుకుపోయాయి. రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పలు పంటలు నీటిలో మునిగిపోయాయి. కొన్ని ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల వారిని సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. దుందుభీ ఉధృతంగా ప్రవహిస్తుండగా, సంగంబండ, కోయిల్‌సాగర్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు.

» పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
» బ్రిడ్జిలపై నుంచి పారుతున్న వరద నీరు
» గ్రామాలకు స్తంభించిన రాకపోకలు



సంగంబండ 7 గేట్లు ఎత్తివేతతో మాగనూర్ మండలం నేరెడ్‌గామ్ వంతెనపై పారుతున్న నీరు

నారాయణపేట/ ఇటిక్యాల/ పెద్దమందడి/ జడ్చర్ల/ ఖిల్లాగణపురం/ ఉప్పునుంతల/కోడేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు రహదారులు దెబ్బతిన్నాయి. మంతన్‌గోడ్ నుంచి గేలపల్లికి వెళ్లే రహదారిలో రోడ్డు, కల్వర్టు దెబ్బతినింది. అక్కడక్కడ పలు రహదారులు గుంతలమయంగా మారాయి. పేట నుంచి మక్తల్‌కు వెళ్లే రహదారి, అప్పక్‌పల్లి నుంచి గుండుమాల్‌కు వెళ్లే రహదారి, మరికల్, దామరగిద్ద రహదారులలో అక్కడక్కడ గుంతలు పడి ధ్వంసమయ్యాయి. నారాయణపేటలో రోడ్లు ధ్వంసమయ్యాయి. వర్షాలు అధికంగా కురియడంతో బ్రిడ్జిలపై నుంచి నీటి ప్రవాహం ప్రవహిస్తూ పలు చోట్ల రాకపోకలు స్తంభించాయి. మాగనూర్ మండలం అడివి సత్యారం బ్రిడ్జిపై నుంచి నీరు ఏరులై పారుతున్నది. ఊట్కూర్ మండలం పగిడిమర్రి బ్రిడ్జిపై నుంచి నీరు పారుతుండటంతో అమీన్‌పూర్, ఓబ్లాపూర్, సామనూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భూనేడ్- కొత్తపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక వర్షం నీటి ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. నర్వ మండలం కల్వాల నుంచి సీపూర్ మధ్య బ్రిడ్జిపై వర్షంనీరు ప్రవహిస్తున్నది. కాగా మాగనూర్ మండలం బాపన్‌కుంట చెరువుకట్టకు గండి పడి నీరు పోగా తాత్కాలికంగా మట్టిని వేసి మరమ్మతులు చేశారు. మక్తల్ పెద్ద చెరువు దగ్గరలో సంగంబండ గ్రావిటీ కెనాల్ కోతకు గురైంది. మక్తల్ మండలం కర్ని చెరువు అలుగు నీటి కల్వర్టు దగ్గర నీరు పారుతుండటంతో రాకపోకలు నిలపాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సందర్శించి అధికారులకు సూచించారు.

● గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కురుస్తున్న భారీ వర్షంతో ఆయా గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు మండలంలోని చాగాపురం, షాబాద గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. మండలంలో 54.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తులుపుచున్నారు. అలాగే ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వంతెనలో మూడు అడుగుల లోతు వర్షపు నీరు చేరడంతో ఉదయం రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు ఉదండాపురం మీదుగా ఇటిక్యాలకు చేరుకున్నట్లు వారు తెలిపారు. అలాగే మండలంలో ఉదండాపురం, షాబాద, చాగాపురం, పెద్దదిన్నె గ్రామాల పరిధిలో లోతట్టు పంటపొలాలకు వరద నీరు రావడంతో పత్తి పంట దెబ్బ తిన్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలుపుతున్నారు.

● ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులపైకి వరద నీరు రావడంతో అధికారులు రహదారులను మూసి వేశారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల-పెద్దమందడి రహదారిలో చిన్న వాగు భారీగా పొంగి కాజ్‌వేపైకి వరద నీరు రావడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రాకపోకలు నిలిపివేశారు. కాగా, భారీ వర్షాలు కురిసిన సందర్భంగా జగత్‌పల్లి గ్రామంలో ఒక కుటుంబం, వెల్టూరు గ్రామంలో ఒక కుటుంబం శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు గుర్తించిన అధికారులు వారిని కమ్యూనిటి హాల్‌కు తరలించినట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని లింగంపేట గ్రామ సమీపంలోని గంజివాగు నిండి అలుగెత్తింది. ఆ నీళ్లన్ని సోమవారం జడ్చర్ల, లింగంపేట గ్రామాల మధ్యదారిలోకి వచ్చి చేరాయి. దీంతో ఆ దారిలో రాకపోకలు స్తంభించాయి. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించినా, అది పూర్తి కాకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ బస్సులు నీళ్లు పారుతున్న ప్రాంతం వరకు వచ్చి, తిరిగి వెళ్లిపోయాయి. దీంతో విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. బ్రిడ్జి నిర్మాణం చేపడ్తుండడంతో పక్కనే మట్టితో వేసిన రోడ్డుకు ఒక భాగంలో నీళ్ల ఉధృతికి కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది.

● వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లి చెరువులు మత్తడి దూకుతున్నాయి. మండలంలోని ఆగారం, కమలొద్దీన్ పూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం అధికారులు ముళ్ల కంచె వేయడంతో పాటు గ్రామపంచాయతీ ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ అడ్డుగా నిలిపి రాకపోకలను స్తంభింప చేశారు. షాపూర్ శివారు ప్రాంతంలో వాగులో వరద నీటి ప్రవాహం పెరగడంతో గ్రామస్థులు వాగు దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోలిపూర్ చెరువు అలుగు ప్రాంతం కబ్జాకు గురి కావడంతో పంటలు మునుగుతున్నాయని తహసీల్దార్ సుగుణకు రైతులు ఫిర్యాదు చేశారు.

● ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు చీకటి వాగు ఉప్పొంగి సోమవారం ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామం నుంచి కంసానిపల్లితండా రంగంపేట గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు మల్లేష్‌తో పాటు పలువురు వాపోయారు. వర్షం వచ్చిందంటే కంసానిపల్లి నుంచి కంసానిపల్లి తండా 2 కి.మీ. రంగంపేటకు 3 కి.మీ. దూరం ఉన్న గ్రామాలకు రాకపోకలు అంతరాయం కల్గుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చినప్పుల్లా గ్రామాలకు ఎలా వెళ్లాలని వారు ప్రశ్నిస్తున్నారు.

● కోడేరు మండలంలో ప్రతి రోజు వర్షం కురవడంతో మెట్ట పొలాల్లో నీరు పడుతున్నదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వరి పైరులు నీటి మునిగినట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టం పోవాల్సి వస్తుందన్నారు. వాగులు వంకలు పొంగి పొర్లడంతో వ్యవసాయదారులు, ప్రయాణికులుఇబ్బందులు పడుతున్నారు.



ఉప్పునుంతల: వరద నీటిలో ఇబ్బందిగా దాటుతున్న రంగంపేట గ్రామస్థులు



ఆగారం, కమలొద్దీన్ పూర్ గ్రామాల మధ్య వాగు కల్వర్టు పై రాకపోకలు నిలపడానికి ఉంచిన ముళ్ల కంచే , వాటర్ ట్యాంక్



జడ్చర్ల మండలం లింగంపేట గ్రామ సమీపంలో గంజివాగు అలుగెత్తడంతో జడ్చర్ల, లింగంపేట మధ్యదారిలో వచ్చి చేరిన నీళ్లు

# వర్షాలకు కూలిన ఇళ్లు



అప్పారెడ్డిపల్లిలో కూలిన దారం నాగమ్మ ఇల్లు



దేదినేనిపల్లి గ్రామంలో వర్షానికి కూలిన దూదేకుల సుల్తాన్ ఇల్లు

పెద్దకొత్తపల్లి/ దామరగిద్ద/ నవాబ్‌పేట/ అలంపూర్/ ఇటిక్యాల/ ఊట్కూర్/ అమ్రాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేదినేనిపల్లి గ్రామంలో మట్టి మిద్దె కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. దేదినేనిపల్లి గ్రామానికి చెందిన దూదేకుల సుల్తాన్ నివాసముంటున్న మట్టి మిద్దె గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తడిసి ఆదివారం రాత్రి నేలమట్టమైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని బాధితుడు తెలిపారు. దూదేకుల సుల్తాన్ ఇల్లు వర్షానికి కూలిపోవడంతో నివాసం ఉండటానికి గూడు లేకుండా పోయింది.

● వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి మట్టి మిద్దె సోమవారం కూలిపోయింది. దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన నిరుపేద రైతు దూల్లకాడి రాములు తనకు ఉన్న రెండు రూముల మట్టిమిద్దె గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇల్లు కూలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన రాములును ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రాన్ని అందించారు. వెంకటప్ప, రాములు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట మండలంలోని కురుస్తున్న భారీ వర్షాలకు గురుకుంటలో బోవొళ్ల జంగయ్య ఇల్లు కూలిపోయిందని గ్రామస్థులు బోవొళ్ల రాజశేఖర్ మంగళవారం తెలిపారు. అలాగే మండలంలో ఇప్పటి వరకు మొత్తం మూడు ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

● భారీ వర్షాల కారణంగా అలంపూర్ మండలంలో పలు చోట్ల మట్టి మిద్దెలు కూలాయి. ఆదివారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి మునిసిపాలిటీలో ఇళ్లు కూలిన వారికి మునిసిపల్ కమిషనర్ శ్రీరాములు పాత మునిసిపాలిటీలో పునరావాసం కల్పించారు. అలాగే మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో మూడు నివాసాలు, లింగనవాయి గ్రామంలో ఒకటి నేల మట్టమయ్యాయి. క్యాతూరు గ్రామంలో ఎంపిడీఓ పద్మావతి, పంచాయతీ సెక్రటరీ దేవిక సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇళ్లు కూలిన వారిని ప్రాథమిక పాఠశాల బాలుర స్కూల్‌లో, వారి బంధువుల ఇళ్లలో పునరావాసం కల్పించారు. లింగనవాయిలో ఆర్ఐ బడేసాబ్ పరిశీలించి వారి బంధువుల ఇంటిలో ఆశ్రయం కల్పించారు.

● గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలో రఫీ అనే వ్యక్తి ఇంటి మిద్దె కప్పు కూలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. మట్టి మిద్దె ప్రమాదకరంగా ఉండటంతో ముందు జాగ్రత్తతో బంధువుల ఇంటిలో నిద్రించడంతో ప్రమాదం తప్పినట్లు తెలిపారు.

● ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో చిన్నపూజారి జయ్యమ్మ మట్టి ఇల్లు, పగిడిమారి గ్రామంలో నలుగురి మట్టి ఇళ్లు కూలి పడ్డాయి.

● ఖిల్లాగణపురం మండలంలో కురిసిన వర్షాలకు సోమవారం 5 పాత ఇళ్లు కూలిపోయాయి. అప్పారెడ్డిపల్లి గ్రామంలో దారం నాగమ్మ మట్టి మిద్దె ఇల్లు, సల్కెలాపూర్ గ్రామంలో భీమమ్మ ఇల్లు, ఉప్పరిపల్లి గ్రామంలో వెంకటయ్య ఇల్లు, ఖిల్లాగణపురంలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం మంతటి నారమ్మ, కల్మల లక్ష్మమ్మ, అర్జునమ్మకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. పంచాయతీ కార్యదర్శి రాజారాం పరిశీలించారు. మండలంలోని వెంకటేశ్వరబావి, మన్ననూర్లలో వర్షం కారణంగా మరో నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



దామరగిద్దలో వర్షానికి కూలిన రాములు మట్టిమిద్దె



అమ్రాబాద్ మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో ముసురు వర్షానికి కూలిన ఇల్లు



అలంపూర్ మునిసిపాలిటీలో కూలిన మట్టి మిద్దెను పరిశీలిస్తున్న వార్డ్ ఆఫీసర్లు

# ఉధృతంగా దుందుభీ



తాడూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

» లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు
» ఐతోల్, సిర్సవాడ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



సంగంబండ జలాశయం 7 గేట్లు తెరవడంతో దిగువకు వెళ్తున్న నీరు

తాడూరు/మక్తల్‌రూరల్/దేవరకద్ర/, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు అలుగులు పారడంతో పాటు దుందుభీ నది ప్రవాహం సోమవారం ఉధృత మైంది. మండల వ్యాప్తంగా రాత్రి 6.2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ప్రధాన రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఒక గ్రామానికి మరొక గ్రామానికి రాకపోకలు నిలిచి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై సిర్సవాడ ఐతోల్ గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ కాజ్‌వేపై వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. అదేవిధంగా పొల్కా రు,గుట్టలపల్లి, చెర్లతిర్మలాపూర్, ఉయ్యాలవా డ, ఆకునెల్లికుదురు, మేడి పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపో యాయి.

దుందుభీ అవతలి భాగంలో వ్యవసాయ పొలాల్లో పంటలు ఏమయ్యాయో అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



సిర్సవాడ వద్ద దుందుభీ నది వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది

### కోయిల్‌సాగర్‌కు 5 షటర్లు తెరిచి దిగువకు నీటి విడుదల

మహబూబ్‌నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు వరద ఉధృతి బాగా పెరిగింది. దీంతో సోమవారం ప్రాజెక్టు 3 షటర్లు ఫీటు ఎత్తు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా సోమవారం నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 32. అడుగులకు చేరింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కురవడంతో అంకిళ్ల, కోయిల్‌కొండ పెద్దవాగుల నుంచి ప్రాజెక్టుకు నీటి ఉధృతి పెర గడంతో అధికారులు 5 షటర్ల నుంచి దిగువకు 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి నీరు రావడంతో జిల్లా నుంచి సందర్శకులు అందాలను తిలకించేం దుకు వస్తున్నారు.

## అలుగు దాటుతూ...

» విధులకు హాజరవుతున్న వైద్య సిబ్బంది

మక్తల్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని కర్ని గ్రామం వద్ద చెరువు అలుగు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు కర్ని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సి ఉండటంతో ప్రతి రోజు అలుగు దాటుకుంటూ విధులకు హాజరై వైద్య సేవలు అందిస్తున్నారు.

వీరితో పాటు ఇతర ప్రభుత్వ సిబ్బంది సైతం కచ్చితంగా హాజరు కావాల్సి ఉండటంతో అలుగు దాటుతూనే విధులు నిర్వహిస్తున్నారు. వీటైనంత తొందరగా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

## సంగంబండ 7 గేట్లు ఎత్తి నీటి విడుదల

నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 7 గేట్లు ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి ఎక్కువగా వస్తుండడంతో సోమవారం 7 గేట్లతో దిగువకు నీటి విడుదల కొనసాగించారు. 6000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6000 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.60 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

## వన మహోత్సవం పూర్తి చేశాం

● ధన్వాడ ఏపీవో సిద్ధేశ్వర్



ధన్వాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఈసారి 38 వేల మొక్కలను నాటేందుకు ప్రభుత్వం టార్గెట్ విధించిందని ఏపీవో సిద్ధేశ్వర్ తెలిపారు. ప్రస్తుతం తాము ఆ టార్గెట్‌ను పూర్తి చేసినట్లు ఏపీవో సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**మండలంలో మొక్కలను ఎక్కడెక్కడ నాటారు?**

ఫారెస్ట్ ఏరియాల్లో మొక్కలు నాటాము.

**ధన్వాడలో ఎన్ని వేల మొక్కలు నాటారు?**

ఇప్పటివరకు 2 వేల మొక్కలను నాటాము.

**ఉపాధి హామీ పనులు నడుస్తున్నాయా?**

వర్షాకాలంలో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి. కూలీలు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

**పనులు ఎప్పటివరకు పూర్తయ్యాయి?**

ఏప్రిల్ నుంచి ప్రారంభమై జూన్ వరకు పనులు కొనసాగాయి.

**ఎంత మంది కూలీలు పని చేశారు?**

మొత్తం 3301 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా ఇందులో 4,229 మంది కూలీలు ఉపాధి హామీలో పనిచేశారు.

## పాపన్న పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



కలెక్టరేట్‌లో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నాయకులు

నారాయణపేట రూరల్/మక్తల్/ధన్వాడ/మరికల్/మాగనూరు/ మద్దూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. సోమవారం జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించి, మాట్లాడారు. ఓ సాధారణ వ్యక్తి కులవృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసమాన ధైర్య సాహసాలతో పోరాటం చేయడం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి ఉమాపతి, డీపీఆర్‌వో రషీద్, జడ్పీ సీఈవో శైలేష్, జిల్లా అధికారులు, లక్ష్మణ్‌గౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, ఎస్.వెంకటేశ్, రవికుమార్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, దామోదర్‌గౌడ్, బస్వరాజ్‌గౌడ్, బాపన్‌పల్లి నర్సిములు, మల్లేష్‌గౌడ్ తదితరులున్నారు.

అదేవిధంగా, మక్తల్ పెద్ద చెరువు వద్ద గౌడ జనహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులుగౌడ్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ మాట్లాడారు. సమితి జిల్లా అధ్యక్షుడు నర్సిములుగౌడ్, శివన్నగౌడ్, కిష్టయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, యాదయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, రంగప్పయాదవ్ పాల్గొన్నారు.

ధన్వాడలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో టైలర్ శ్రీనివాస్‌గౌడ్, జుట్ల సత్యనారాయణగౌడ్, జుర్రం లక్ష్మయ్యగౌడ్, జుర్రం రాజేష్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, సురేందర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, బాలకిష్టయ్యగౌడ్, వినోద్‌గౌడ్, వెంకటాపూర్ గోవర్ధన్‌గౌడ్, అభిలాష్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులున్నారు.

మరికల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు గ్రామస్థులు పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలతో నివాళి అర్పించారు.

మాగనూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో గౌడ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలతో నివాళి అర్పించారు. అశోక్‌గౌడ్, గోవర్దన్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, పోస్టు అశోక్‌గౌడ్, వెంకటయ్యగౌడ్ తదితరులున్నారు.

మద్దూర్ రాజీవ్‌గాంధీ చౌరస్తాలో గౌడ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వీరేష్‌గౌడ్, మండల నాయకులు దేవేందర్ సంజీవ్, సాయిబాబు, వెంకట్రాములు, నర్సింహ, పాపయ్య, నాగేష్, వెంకటేష్, విఠలయ్య, రాములు, మాధవ్, సాయప్ప, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### నేడు ఆర్‌ఎస్‌ఎస్ సమావేశం

మక్తల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆర్‌ఎస్‌ఎస్ సమావేశం నిర్వహించనున్నామని సంఘచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ ఖండ పరిధిలోని మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాల నుంచి హిందూ బంధువులు, సంఘ సేవకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

### రేపు క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర దేవాలయంలో బుధవారం ఉదయం 7 గంటలకు స్వామివారి రుద్రాభిషేకం కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరు కానున్నారని మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం తెలిపారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు పేట అభినందన్ గార్డెన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

### నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణ , ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, భీమా నదుల ఒడ్డున ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కృష్ణానది వరదను ఆయన పరిశీలించి, మాట్లాడారు. వారంరోజుల నుంచి ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు మండలంలో వివిధ గ్రామాల ప్రజలు మట్టి మిద్దెల ఇళ్లల్లో జాగ్రత్తగా ఉండాలని, అదేవిధంగా పశువుల కాపరులు, రైతులు, మత్స్యకారులు నదిలోకి దిగొద్దని కోరారు.

### పాఠశాలకు టీవీ అందజేత

దామరగిద్ద, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన రిటైర్డు ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ చంద్రయ్య సోమవారం టీవీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించి భవిష్యత్తులో మంచి ర్యాంకులు సాధించి గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం బాలమురళి, ఉపాధ్యాయులు చంద్రయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

### పంటల నమోదు ప్రక్రియ చేపట్టాలి

దామరగిద్ద, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే వానాకాలం పంటల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీ బక్క నర్సప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన కంది, పత్తి, పెసరు పంటలకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

» ఎస్పీ యోగేష్‌గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

మక్తల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలతో పాటు ఇతర మతపరమైన వేడుకలకు డీజేల అనుమతి లేదని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వట్టం రవి కన్వెన్షన్ హాల్‌లో మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాల్లోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, హిందూ మత పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అధిక శబ్దం వచ్చే డీజేల వల్ల వృద్ధులు, చిన్నారులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. శబ్దకాలుష్యం వస్తుందని అందుకే డీజేలను నిషేధించామన్నారు. డీజేలను ఎవరైనా ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గణేష్ మండపాల వద్ద ప్రధాన వీధుల్లో ఇతరులకు ఇబ్బంది లేకుండా రిబ్బన్లు ఏర్పాటు చేయాలన్నారు. పండుగ ముగిసిన తర్వాత వాటిని తొలగించాలన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, నవీన్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రోడ్డు పనులు ప్రారంభం



ప్రత్యామ్నాయ రోడ్డు పనులు చేపడుతున్న మునిసిపల్ అధికారులు

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నారాయణపేట, కొండారెడ్డిపల్లి చెరువు అలుగు పారడంతో చెరువు కింద ఉన్న కాలువలు నిండి పట్టణంలోని ప్రతిభ కాలేజ్ వెనుక ఉన్న కాలనీ నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తక్షణ చర్యలకు అధికారులను, పార్టీ నాయకులను ఆదేశించారు. దీంతో నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ చిట్టెం మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గందె చంద్రకాంత్, ఎండీ.సలీం, వెంకట్‌గౌడ్, మునిసిపల్ మేనేజర్ అజీమ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు ప్రతిభ కాలేజ్ వెనకాల నుంచి రాకపోకలకు గాను ప్రత్యేకంగా రోడ్డును ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ అధికారులు పనులు ప్రారంభించారు. బ్రిడ్జిపై నుంచి నీరు పారడంతో ప్రజలు అటువైపు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి జయంతి



మక్తల్‌లో జ్యోతీబా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గిఫ్ట్ ప్యాక్‌లు అందిస్తున్న దయాకర్‌రెడ్డి కుమారుడు సిద్ధార్థరెడ్డి

మక్తల్/నర్వ/ఊట్కూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి 72వ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆయన కుమారుడు సిద్దార్థరెడ్డి, దయాకర్‌రెడ్డి అభిమానులు పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆ తర్వాత పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాత్మ జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో 30 ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వడ్వాట్ రవీందర్, ప్రతాప్‌రెడ్డి, సంగంబండ సిద్దు, రాకేష్, లక్ష్మీనారాయణగౌడ్, సద్దాంహుసేన్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్వలో ఎన్టీఆర్ విగ్రహం ముందు దయాకర్‌రెడ్డి చిత్రపటానికి వీరాభిమాని జగన్మోహన్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దయాకర్‌రెడ్డి అభిమానులు శ్రీనివాస్‌రావు, ఖాజా, వెంకట్‌రాంరెడ్డి, ఆంజనేయులు, నర్సింహ, మల్లేష్ యాదవ్, రాజు, గుడిసె వెంకటయ్య, అయ్యన్న, లక్కర్‌దొడ్డి వెంకటయ్య, వెంకప్ప, నర్సింహారెడ్డి, శ్రీను తదితరులున్నారు.

ఊట్కూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు దయాకర్‌రెడ్డి వేడుకలు నిర్వహించారు. మెయిన్ బజార్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, నర్సింహాగౌడ్ తదితరులున్నారు.

### ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ యోగేష్‌గౌతమ్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరు ఫిర్యాదులను ఆయన పరిశీలించి, పరిష్కారానికి సీఐ, ఎస్‌ఐలను ఆదేశించారు.

### వాగులు, కల్వర్టు ప్రవాహాల దగ్గర అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట/మాగనూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని కల్వర్టులు, వాగులు, రోడ్లపై పారుతున్న నీటి వద్దకు ప్రజలు పోకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సోమవారం సూచించారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న వాగుల ప్రవాహం వద్ద పోలీస్ సిబ్బంది పహారా ఉండాలని సూచించారు. కాగా పేట మండలం పేరపళ్ల వాగు వద్ద సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అలాగే మాగనూరు-వర్కూరు గ్రామాల మధ్య చిన్నవాగు బ్రిడ్జిపై నీటి ప్రవాహాన్ని ఎస్ఐ అశోక్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. ఈ బ్రిడ్జిలపై ఎవరు కూడా వెళ్లకుండా పోలీసులు, వీఆర్ఏలు పహారాగా ఉండాలన్నారు.

### సరైన పరిహారం చెల్లిస్తేనే భూములిస్తాం

● ప్రతిజ్ఞ చేసిన పేరపళ్ల రైతులు

నారాయణపేటరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కింద ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని, భూములకు సరైన పరిహారం అందిస్తేనే భూములు ఇస్తామని భూనిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షుడు ధర్మరాజ్ సమక్షంలో సోమవారం పేరపళ్ల రైతులు ప్రతిజ్ఞ చేశారు. అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ ఎకరాకు రూ.14లక్షలు ఇస్తామనడం రైతు నోట్లో మట్టికొట్టడం అవుతుందన్నారు. గత 35 రోజులుగా రైతులు జిల్లా కేంద్రంలో దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఆందోళనలు తప్పవన్నారు. రైతులు అంజప్ప, హన్మంతు, బోయిన రాములు, భీమప్ప, కిష్టప్ప, వెంకటప్ప, పద్మమ్మ తదితరులున్నారు.

### పీఆర్టీయూటీఎస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

దామరగిద్ద, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ అమలు చేయాలని సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న పీఆర్టీయూటీఎస్ మహాధర్నా పోస్టర్‌ను ఎంఈవో కృష్ణారెడ్డి, జడ్పీహెచ్ఎస్ క్యాతన్‌పల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం సత్యనారాయణ సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సత్యనారాయణరెడ్డి, ఎస్.రమేష్, తిప్పన్న, ఉషనప్ప, వెంకటేష్, రత్నయ్య, లతీఫ్, లక్ష్మి, మహిపాల్ తదితరులున్నారు.

## కర్ని వెళ్లే దారిలో రాకపోకలను నిలిపివేయండి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్



కర్ని అలుగు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం కర్ని గ్రామానికి వెళ్ళే దారిలో కల్వర్టుపై పారుతున్న వరద నీరు ఉధృతి తగ్గే వరకు ప్రజల రాకపోకలను నిలిపివేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మక్తల్ మండలంలోని కర్ని గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టుపై పారుతున్న వరద నీటి ప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. కర్ని గ్రామానికి ఎగువ ప్రాంతంలో ఉన్న టేకులపల్లి, రుద్ర సముద్రం, గొలపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుత సమయంలో ఆయా గ్రామాల ప్రజలు ఇటువైపు రావొద్దని సూచించారు. కల్వర్టుకు రెండు వైపులా సిబ్బందిని ఉంచి ప్రజల రాకపోకలను నిలిపి వేయాలని ఎంపీడీవో రమేష్‌ను ఆదేశించారు. వాగు దాటేందుకు ఎవరూ ప్రయత్నించకుండా చూడాలని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవోలకు సూచించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఉన్నారు.

**మినీ స్టేడియం పరిశీలన**

మక్తల్ : పట్టణంలోని మినీ స్టేడియాన్ని సోమవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మినీ స్టేడియం పునఃనిర్మాణం కోసం స్టేడియాన్ని ఆమె పరిశీలించారు. మైదానం ఎన్ని ఎకరాలు ఉంది.. ప్రస్తుతం ఎన్ని ఎకరాల్లో నిర్మించారు.. ఎన్ని ఎకరాల స్థలం అవసరం అని ఆరా తీశారు. ప్రస్తుతం స్టేడియం భవనాల్లో కొనసాగిస్తున్న కళాశాల తరగతులను ప్రైవేటు భవనాలకు మార్పించాలన్నారు. జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి కలెక్టర్‌కు వివరించారు. జిల్లా అధికారులు ఉన్నారు.

## రైతులకు 13 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందించాం

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావులతో కలిసి యూరియా, ఎరువుల లభ్యతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలోని 13 మండలాల్లో ఏప్రిల్ నుంచి ఆగస్టు 2025 వరకు 13,594.6 మెట్రిక్ టన్నుల యూరియా వాడకం జరిగిందని అన్నారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 15 ఫిర్యాదులు

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తు త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 15 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుకు విన్నవిస్తు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి జిల్లా అధికారులందరు హాజరు కావాలని సూచించారు.

**బఫర్‌జోన్‌లో నిర్మించిన ప్రహరీని తొలగించాలి**

నారాయణపేట పళ్ల హనుమాన్ మందిర్ వాగు వద్ద బఫర్ జోన్‌లో అక్రమంగా వెంచర్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా అనుమతి లేకుండా నిర్మించిన ప్రహరీని తొలగించాలని బీకేఎస్ పట్టణ కార్యదర్శి అంజయ్య సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు ఫిర్యాదు చేశారు.

## ఊట్కూర్ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



టీకాల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శైలజ

ఊట్కూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్‌డీడీ మాప్ పర్యవేక్షణలో భాగంగా ఆసుపత్రిలో ఈడీడీ క్యాలెండర్, ఎంసీహెచ్ ఆన్‌లైన్ ఎంట్రీలు, డెలివరీ, ఎన్సీడీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే ఆసుపత్రిలోని రికార్డులను, టీకాల నిల్వలను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోషి, జిల్లా ఎన్సీడీ సమన్వయకర్త విజయ్‌కుమార్, పర్యవేక్షకుడు నర్సింహులు, నర్సింగ్ ఆఫీసర్ నాగజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ తదితరులున్నారు.

## ప్రీ ప్రైమ రీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీలకే ఇవ్వాలి



ధర్నా శిబిరం వద్ద తహసీల్దార్ అమరేంద్రకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

నారాయణపేటరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీనియర్ జిల్లా అధ్యక్షురాలు శశికళ డిమాండ్ చేశారు. సోమవారం పేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు ముందు నిర్వహించిన అంగన్ వాడీ కార్యకర్తల ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఐసీడీఎస్‌తో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం కోసం నూతన విద్యా విధానాన్ని తెచ్చిందన్నారు. ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను ప్రభుత్వం నిర్వహిస్తే ఆరేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీలకు రావడం తగ్గి అంగన్‌వాడీలు మూతపడే ప్రమాదముందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అమరేంద్రకృష్ణకు అందజేశారు. అంతకు ముందు పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోవిందరాజు, భారతి, కవిత, పుష్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా నీలకంఠస్వామి జల్దిబిందె



కోస్గిలో గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

నారాయణపేట రూరల్/కోస్గి/మద్దూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా కేంద్రంలోని బాహర్‌పేట కురుహినిశెట్టి జాంద్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం నీలకంఠస్వామి వారికి జల్దిబిందె ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందికోలు ఆటలతో ఊరేగించారు. జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కురుహినిశెట్టి కుల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అదేవిధంగా, కోస్గి పట్టణంలో జాంద్ర కులస్తులు శ్రావణ మాస ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నీలకంఠ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గుస్సాడి నృత్యం, ఒగ్గు డోలు, ఘట్ట విన్యాసం, కోలాటాల మధ్య స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు.

మద్దూర్‌లో జాంద్ర కులస్తులు స్థానిక నీలకంఠస్వామి ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా కలశ ఊరేగింపు, పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, శివారులోని నిడ్జింత రోడ్డులో వెలసిన వీరభద్రేశ్వరుని ఉత్సవాల సందర్భంగా జల్దోత్సవ ఊరేగింపును పురవీధుల గుండా నిర్వహించారు. అనంతరం రెట్టపట్ల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించాలి




మరికల్‌లో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో మాట్లాడుతున్న ఎంఈవో

ధన్వాడ/మరికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించుకునే విధంగా బోధన అందించాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్, ఎంఈవో గాయత్రి అన్నారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం టీఎంఎల్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనోపకర మేళాను ప్రదర్శించారు. మేళాను జిల్లా, మండల స్థాయి విద్యాధికారులు, విద్యార్థులు తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడి ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. బాలుర పాఠశాల హెచ్‌ఎం నర్సింహ్మాచారి, సీఆర్‌పీలు నారాయణ, వెంకట్రాములు, నీరటి రాఘవేందర్‌నాయుడు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అదేవిధంగా, మరికల్ ఎంఆర్‌సీలో నిర్వహించిన మండల స్థాయి బోధనాభ్యాసన సామగ్రి మేళాను ఎంఈవో మీర్జాకరీముల్లా తిలకించారు. అనంతరం ప్రతీ విభాగంలో ప్రథమ, ద్వితీయ విజేతలకు, అలాగే ప్రతీ పాఠశాలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరత్నమ్మ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవర్దన్‌గౌడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో వరినాట్లు వేసి నిరసన

మరికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పసుపుల ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తు సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన బురదలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో వరినాటే పరిస్థితి వచ్చిందంటే కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడ్డారన్నారు. వారంరోజుల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, రామస్వామి, పెంటమీది నర్సిములు, మతిన్, తిమ్మన్నగౌడ్ తదితరులున్నారు.



వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు